సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
17వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం,21 మే 2024

10 రోజులముందే ఏజెంట్ల వివరాలివ్వండి

- ఆర్వో జే.వెంకటరావు సూచన

కాకినాడ, మేజర్ న్యూస్ : ఎన్నికల కౌంటింగ్ కు హాజరయ్యే ఏజెంట్ల వివరాలను కనీసం 10 రోజుల ముందు తమకు అందజేయాలని కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే.వెంకటరావు పోటీలో ఉన్న అభ్యర్థులు/ రాజకీయ పార్టీలకు సూచించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో సోమవారం పోటీలో ఉన్న అభ్యర్థులు/ వారి తరపు ప్రతినిధులతో సమావేశమయ్యారు. కౌంటింగ్ ప్రక్రియపై వీరికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ కౌంటింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల తరపు ఏజెంట్ల కు సంబంధించిన సమాచారాన్ని ముందుగా తెలియజేస్తే విచారణ అనంతరం వీరికి పాస్ లు అందజేస్తామన్నారు. జూన్ 4వ తేదీ ఉదయం కొలుత పోస్టల్ బ్యాలెట్ ను లెక్కిస్తామని, సమాంతరంగా ఈవీఎంల లెక్కింపు ప్రక్రియ కూడా ప్రారంభిస్తామని చెప్పారు. ఎన్ని టేబుల్స్ ఏర్పాటు అవుతున్నాయి? ఎన్ని రౌండ్ల లెక్కింపు ఉంటుంది? ఏజెంట్లకు వర్తించే నిబంధనలు ఏమిటి? వంటి అన్ని అంశాలపై స్పష్టతనిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఆర్ఓ చల్లన్నదొర, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.



ఆ రెండు నియోజకవర్గాలకు

హెచ్చరికలు



కాకినాడ, మేజర్న్యూస్ ప్రతినిధి : జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ముగిసినప్పటికీ మరో 15 రోజులు అదనపు బలగాలను రాష్ట్రంలో ఉంచాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. పల్నాడు, రాయలసీమల్లో ఎన్నికల అనంతరం పెద్ద ఎత్తున ఘర్షణలు జరుగుతున్నాయి. వీటిపై కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సిట్ కూడా ఏర్పడింది. సిట్ నివేదిక కూడా ఇచ్చింది. అయితే ప్రశాంతతకు మారుపేరుగా పచ్చని గ్రామీణ వాతావరణంలో ఉండే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కూడా అల్లర్లు జరిగే అవకాశాలు ఉన్నాయా అంటే ఉన్నాయని కేంద్ర నిఘా వర్గాలు అంటున్నాయి.

ముఖ్యంగా కాకినాడ జిల్లా పరిధిలోని కాకినాడ, పిఠాపురం నియోజవర్గంలలో కౌంటింగ్ తర్వాత నుంచి అల్లర్లు జరిగే ప్రమాదం ఉందని ఈ వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగాను కాకినాడ నగరంలో ముఖ్యంగా ఏటిమొగ, దుమ్ములపేట, రామకృష్ణారావుపేట తదితర ప్రాంతాలను కేంద్ర నిఘా వర్గాలు సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించాయి. ఇలాంటి నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాల్లో అదనపు పోలీసు బలగాలను మోహింపజేస్తున్నారు. ఇప్పటికే కౌంటింగ్ కు సంబంధించి జిల్లా కలెక్టర్ నివాస్, ఎస్పి సతీష్ కుమార్ సమీక్షలు జరిపారు. కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికలతో ఈ రెండు నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

కాకినాడకు సంబంధించి ఆరంభం నుంచి వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. సిటీ ఎమ్మెల్యేగా ఉండి వైసిపి నుంచి పోటీ చేసిన చంద్రశేఖర్ రెడ్డి, టిడిపికి చెందిన మాజీ ఎమ్మెల్యే, టిడిపి అభ్యర్థి వనమాడి కొండబాబు మధ్య ఐదేళ్ల నుంచి వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకొంటున్నారు. ఒకరినొకరు తిట్టుకుంటున్నారు. ఘర్షణలకు దిగుతున్నారు. ఈ ఇరు వర్గాల మధ్య సవాళ్లు ప్రతిసవాళ్లతో నగర ప్రజలు కూడా ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ఎన్నికలలో వీరిద్దరూ తలబడ్డారు. దీనికి తోడు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎన్నికల ప్రచారం చివరిరోజు 11వ తేదీ సాయంత్రం స్థానిక బాలాజీ చెరువు సెంటర్ వద్ద జరిగిన సభలో చంద్రశేఖర్ రెడ్డిని టార్గెట్ చేసి మాట్లాడారు.

ఎన్నికలరోజు కూడా చెదురుమదురు సంఘటనలు ఈ నియోజకవర్గంలో జరిగాయి. దీనిని దృష్టిలో పెట్టుకునే కేంద్ర వర్గాలు హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. అభ్యర్థులు ఇద్దరూ గెలుస్తా మన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఏవర్గం ఏవర్గంపైదాడి చేస్తుంది అన్నది హాట్ టాపిక్‌గా మారింది. మరోపక్కజనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేసారు. ఆయనపై వైసీపీ అభ్యర్థిగా కాకినాడ ఎంపీ గీత పోటీ చేసారు. పవన్ కళ్యాణ్ కు మద్దతుగా టిడిపి నుంచి పిఠాపురం పార్టీ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే వర్మ విస్తృత ప్రచారం చేసారు. ఇక్కడ పవన్ గెలుపు ఖాయం అయింది. అయితే ఎన్నికల రోజున యు.కొత్తపల్లిలో మత్స్యకార సామాజికవర్గం ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే వర్మను నిలదీసారు. కొంత వివాదం జరిగింది. ఇక వైసిపి అభ్యర్థి వంగా గీతను అయితే పిఠాపురం, గొల్లప్రోలు మండలాలలో ఓటర్లు నేరుగా మొహం మీద తిట్టిపోసారు. ఏ మొహం పెట్టుకొని వచ్చావంటూ నిలదీశారు. ఇది కూడా వివాదం అయింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 నియోజకవర్గాలు ఉంటే కేవలం ఈ రెండు నియోజకవర్గాలలోనే ఘర్షణలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాలకు అదనపు పోలీసు బలగాలను పంపిస్తున్నారు.

అవసరమైతే కాకినాడలోని మూడవ ఏపీఎస్పీ బెటాలియన్ పోలీసులను పంపేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడ ఎలాంటి అల్లర్లు జరిగినా ఉక్కుపాదంతో అణచివేస్తామని ఇప్పటికే జిల్లా ఎస్.పీ. సతీష్ కుమార్ హెచ్చరికలు జారీ చేశారు. కౌంటింగ్‌రోజు కూడా మీడియాతో సహా ప్రతిఒక్కరిని తనిఖీ చేసి పాసులు ఉన్నవారిని మాత్రమే లోనికి అనుమతిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్ స్పష్టం చేశారు. కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికలతో ఈ రెండు నియోజకవర్గాల్లో ఏం జరుగుతుందో అన్న ఆందోళన ఓటర్లు, ప్రజల్లో ఏర్పడింది.ముఖ్యంగా టిడిపి వైసిపి, జనసేన వైసిపి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు గురవుతున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు వాటిని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలి

పెరవలి, మేజర్ న్యూస్ : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వాటిని పిల్లలు అదరూ సద్వినియోగం చేసుకోవాలని రిసోర్స్ పర్సన్ కరటూరి విశ్వనాథం అన్నారు. మే 20వ తేదీ సోమవారం ముక్కామల శ్రీ ఇనుప కోళ్ల రాఘవరావు మెమోరియల్ శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించిన ఆయన శిక్షణ కార్యక్రమం సందర్భంగా ఉదయం 8 గంటల నుండి 11-30వరకువిద్యార్థులతో ధ్యానం చేయించడంకథల చదివించడం వేమన పద్యాలు చదివించడం , జనరల్ నాలెడ్జ్, టేబుల్సెచెప్పడం జరిగింది. అనంతరం మెమరీ గేమ్ మరియుఆటలు ఆడించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 23మంది విద్యార్థులు రిసోర్స్ పర్సన్స్ కె విశ్వనాథం కే భవాని మధులీల విద్యార్థులు పాల్గొనడం జరిగింది. విరామ సమయంలో విద్యార్థులందరికీ స్నాక్స్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం గ్రంథాలయ అధికారి ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించడమైనది.

అప్షాన్ కలీం కి జెఎన్టీయుకె పిహెచ్‌డి

కాకినాడ, మేజర్ న్యూస్ : నిపుణుల బృందం సిఫార్సు మేరకు అప్షాన్ కలీం సిద్ధాంత వ్యాసం "ఆప్టిమైజేషన్ ఆఫ్ అర్బన్ సౌండ్ క్లాసిఫికేషన్ ఫర్ ఎడ్జ్ డివైజస్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈమెకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) విభాగంలో లభించినది. అప్షాన్ కలీం తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) ఈసిఈ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డా.ఐ.శాంతిప్రభ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద నిర్మిస్తున్న అన్నదాన భావన నిర్మాణానికి సోమవారం రాజోలుకు చెందిన బలభద్ర రాయుడు వారి కుటుంబ సభ్యులు రూ.51,116 లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వామి వారి దర్శనం చేయించారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిషోర్ కుమార్, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

పనులు పూర్తి స్థాయిలో ఉండాలి

- ఎంపిడిఓ

అల్లవరం, మేజర్ న్యూస్ : సోమవారం ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్ మండలంలోని గోడితిప్ప, తుమ్మలపల్లి, గోడిలంక తదితర గ్రామాల్లో పర్యటించి ఉపాధి హామీ నిధులతో చేపట్టి పూర్తి చేసిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం, సిమెంట్ రోడ్లు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో ప్రజలకు ఉపయోగపడేలా పూర్తి స్థాయిలో నిర్మాణ లు ఉండాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ను ఆదేశించారు. రోడ్స్ కు ఇరువైపులా బెర్మ్‌లు, ప్రహరీ గోడలకు ప్లాస్టింగ్ లేక పోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసి వెంటనే అవి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ దిలీప్, రోజా, మహేష్, సంతోష్ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమును సందర్శించిన పిఠాపురం ఆర్వో

కాకినాడ, మేజర్ న్యూస్ : పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి సోమవారం కాకినాడ జేఎన్టీయూ డా. బి.ఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలోని ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామాగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూమును సందర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూముకు వెళ్లి అక్కడి భద్రతను పర్యవేక్షిస్తునట్లు ఆయన తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతిపై కలెక్టర్‌ని కలిసిన బిజెపి ప్రతినిధులు

కాకినాడ, మేజర్ న్యూస్ : తుని మండలం రాజుల కొత్తూరు సమీపంలో సుమారు 48 గంటల క్రితం నగ్నంగా ఒక మహిళ మృతదేహం అనుమానాస్పద స్థితిలో గుర్తించిన నేపథ్యంలో మృతికి కల కారణాలపై సమగ్రమైన విచారణ జరిపించాలని భారతీయ జనతా పార్టీ కోరింది.

సోమవారం ఉదయం 12 గంటలకు కాకినాడ జిల్లా కలెక్టర్ నివాస్ ను భారతీయ జనతా పార్టీ ప్రతినిధుల బృందం కలిసి ఈ మేరకు డిమాండ్ చేశారు .ప్రతినిధుల బృందం లో బిజెపి కాకినాడ జిల్లా అధ్యక్షులు మింట్ ఇండిపెండెంట్ డైరెక్టర్ చిలుకూరి రామకుమార్ తోపాటు గట్టి సత్యనారాయణ, దువ్వూరి సుబ్రహ్మణ్యం, దాట్ల సూర్యనారాయణరాజు ఉన్నారు. ప్రతినిధుల బృందం మహిళ మృతికి సంబంధించిన పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కి వినతి పత్రాన్ని సమర్పించారు. మహిళ మృతదేహం లభ్యమైన తీరుతెన్నులు జిల్లా వ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిందని వారు ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల కాలంలో ఎన్నికల సందర్భంగా ఎన్నికల తరువాత జరిగిన అనేక సంఘటనలు మరియు మహిళా మృతదేహం లభ్యమైన స్థితిని బట్టి ఆమెగా హత్యకు గురైనట్టు స్పష్టంగా తెలుస్తోందని, అయితే ఆమె మృతదేహం నగ్నంగా ఉన్న నేపథ్యంలో హత్యకు ముందు ఆమె అత్యాచారానికి గురైందా అనే విషయాలపై సమగ్ర దర్యాప్తు జరగాల్సి ఉందని, అదే విధంగా ఎన్నికలు జరిగిన కేవలం రెండు మూడు రోజులకే మహిళ మృతదేహం లభ్యం కావడంతో ఈ హత్య రాజకీయ హత్య అనే కోణంలో కూడా విచారణ కొనసాగాలని వారు డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా రాష్ట్రంలోనే ప్రశాంతమైన జిల్లాగా పేరు ఉందని, అయితే ఇటీవల కాలంలో జిల్లాలో హత్యలు, మానభంగాలు , మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వంటి సంఘటనలు తరచుగా చోటు చేసుకోవడంతో కాకినాడ జిల్లా ప్రశాంతమైన జిల్లా అనే పేరు చరిత్ర గానే మిగిలిపోతుంది అనిపిస్తోందని వారు కలెక్టర్కు సమర్పించిన వినతి పత్రంలో అనుమానాన్ని ఆందోళనను వ్యక్తం చేశారు. అనుమానాస్పద స్థితిలో మహిళ మృతదేహం లభ్యమై దాదాపు 48 గంటలు గడుస్తున్న మహిళ ఎవరు అనే విషయంలో ఇప్పటివరకు స్పష్టత వచ్చినట్టు కనిపించటం లేదని ,దర్యాప్తును పోలీస్ యంత్రాంగం వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్ కోరారు. ఈ వినతి పత్రాన్ని వారు జిల్లా పోలీస్ సూపరిండెంట్ కు కూడా పంపించారు.

రమణీయంగా అన్నవరప్పాడు వెంకన్న కల్యాణోత్సవం

పెరవలి, మేజర్ న్యూస్ : ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరప్పాడు గ్రామంలో 16 వ నెంబర్ జాతీయ రహదారి ప్రక్కన వేంచేసి ఉన్న శ్రీ అలిమేలుమంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాలు ఈనెల 19వ తేదీ ఆదివారం నుంచి 23వ తేదీ గురువారం వరకు జరుగుతున్న సంగతి విధితమే. ఉత్సవాలలో రెండో రోజైన మే 20వ తేదీ సోమవారం వైశాఖ శుద్ధ ద్వాదశి గడియలలో స్వామి వారి దివ్య కళ్యాణం ఘనంగా జరిగింది. ముక్కామల వాస్తవ్యులు సలాది వీర వెంకట సూర్యనారాయణ శ్రీమతి రాజేశ్వరి దంపతుల మనుమడు సలాది మధుసూదన్ మైత్రి దంపతులచే నల్ల సత్యనారాయణమూర్తి కుటుంబ సభ్యులచే అన్నవరప్పాడు వాస్తవ్యులు సంకు సుబ్బారావు కుమారులు కృష్ణమూర్తి పద్మావతి దంపతులచే మరియు ఖండవల్లి వాస్తవ్యులు ఓబలిశెట్టి సూర్యనారాయణ కుటుంబ సభ్యులచే స్వామివారి కళ్యాణం రమణీయంగా జరిగింది. తదుపరి అన్నవరప్పాడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయమునకు లక్ష్మీ కటాక్ష స్తిత్యర్థం శ్రీ లక్ష్మీ హోమం కార్యక్రమం నిర్వహించారు.

ఉత్సవాలలో పాల్గొన్న స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులందరికీ ఆలయకార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది అన్నప్రసాద వితరణ ఏర్పాట్లు లో స్వయంగా పాల్గొని భక్తులకు ఏ విధమైన ఆసౌకర్యం కలగకుండా స్వామివారి ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూఉత్సవాలు జరిగే ఐదు రోజులు దాతల భక్తుల సహకారంతో చలివేంద్రం ప్రసాదం, అన్న ప్రసాద వితరణ ఏర్పాట్లు చేస్తున్నాము అన్నారు. వెంకన్న ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మించిన శ్రీ ఉమా విశ్వేశ్వర స్వామివారిని మరియు కోనేటిలో కొలువైయున్న శ్రీ అంబికా సమేత స్ఫటిక లింగ రూప శ్రీ మహా మహేశ్వర స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు ఏ విధమైన ఆసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది చక్కటి ఏర్పాట్లు చేశారు.

కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న పరిశ్రమలు

-30 మంది కార్మికులను తొలగించిన సెరామిక్స్ కంపెనీ

సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట రాక్ సిరామిక్స్ పరిశ్రమ కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ కార్మికులను తొలగిస్తుంది. సామర్లకోట ఏడిపి రోడ్లులో సెరామిక్స్ లో పనిచేస్తున్న 30 మంది కార్మికులను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా డ్యూటీకి వెళ్తున్న సమయంలో సెక్యూరిటీ ద్వారా కంపెనీలో కేవలం ఇవ్వకుండా అడ్డుకున్నారు. దీంతో కార్మికులు లేబర్ కమిషనర్ తాసిల్దార్ కార్యలయల వద్ద నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా సెరామిక్స్ కార్మికులు మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నామని అర్ధాంతరంగా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తమను తొలగించారని దీంతో కుటుంబాలతో రోడ్డును పడ్డామని అన్నారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని చర్చలకు పిలిపించి మూడు నెలల జీతం ఇచ్చి రిజైన్ చేయాలని యాజమాన్యాలు తెలుపుతున్నాయన్నారు. 40 నుంచి 50 సంవత్సరాలు పైబడిన కార్మికులు ఉన్నామని ఇప్పుడు అర్ధాంతరంగా తొలగిస్తే ఏం చేయాలని ప్రశ్నించారు. తక్షణం ప్రజా ప్రతినిధులు ఉన్నత అధికారులు యాజమాన్యంతో చర్చించి తమకు ఉపాధి యాజమాన్యంతో చర్చించి తొలగించిన 30 మంది కార్మికులను విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సామర్లకోట తాసిల్దార్ శ్రీనివాస్ కు వినతిపత్రాన అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మరింత పరిజ్ఞానం

పెద్దాపురం,మేజర్న్యూస్ : పుస్తక పఠనంతో మరింత పరిజ్ఞానం పెరుగుతుందని, గ్రంధాలయాధికారి పాలంకి నాగరాజు తెలిపారు. పెద్దాపురం ప్రధమ శ్రేణి శాఖా గ్రంధాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా సోమవారం గ్రంధాలయాధికారి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్ధులకు కథలు వినిపించడం, పుస్తక సమీక్ష చేయడం జరిగింది. ఉపాధ్యాయులు ఆర్.వెంకటేశ్వరరావు విద్యార్ధులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తూ చదువు యొక్క ప్రాముఖ్యత వివరించారు. అలాగే ఉపాధ్యాయులు జి.లక్ష్మీనారాయణ స్పోకెన్ ఇంగ్లీష్‌పై అవగాహన కల్పించి, స్పోకెన్ ఇంగ్లీష్ యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్ధులు, గ్రంధాలయ పాఠకులు, సిబ్బంది సింగం బుల్లియ్య, తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట పట్టణ పరిధి లోని 33/11 కెవి విద్యుత్ లైన్ మరమ్మత్తుల కారణంగా సామర్లకోట సబస్టేషన్ పరిధిలోని 11కెవి అన్నపూర్ణమ్మ ఫీడర్ కు విద్యుత్ సరఫరాను 2వ తేదీ మంగళవారం నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్ కొఆపరేషన్స్ ఇఇ ఎ బి ఎన్ డి ఎస్ ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకూ పట్టణం లోని బళ్లమార్కెట్, విగ్నేశ్వర దియేటర్, వీర్రాఘవాపురం ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్టు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి తమకు సహకరించాలని ఇఇ ప్రభాకర్ తెలిపారు.

స్ట్రాంగ్ రూముల భద్రతపై నిరంతర పర్యవేక్షణ

- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్

కాకినాడ, మేజర్ న్యూస్ : స్ట్రాంగ్ రూముల భద్రతను నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ పేర్కొన్నారు.సోమవారం కాకినాడ జేఎన్టీయూ డా.బిఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలోని ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమును, జేఎన్టీయూ స్టూడేంట్స్ క్యాంటీన్ పైన ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల కంట్రోల్ రూమును జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్..జిల్లా ఎస్పీ ఎస్.సతీశ్ కుమార్, రిటర్నింగ్ అధికారులతో కలిసి పరిశీలించి స్ట్రాంగ్‌రూములభద్రతవివరాలుఅడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ మాట్లాడుతూ జేఎన్టీయూలోకాకినాడ జిల్లాకు సంబంధించి పార్లమెంటు, ఏడుఅసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామాగ్రిని సురక్షితంగా భద్రపరచడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూములకు సీల్ వేయడం జరిగిందని ఆయన తెలిపారు. స్ట్రాంగ్ రూములను సీసీటీవీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు స్ట్రాంగ్ రూముల భద్రతను పరిశీలించేందుకు విలుగా క్యాంటీన్ పైన ఉన్న యోగా సెంటర్లో సీసీటీవీ కెమెరాల కంట్రోల్ రూమును ఏర్పాటు చేశామన్నారు.

స్ట్రాంగ్ రూముల భద్రతకు సంబంధించి ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో పాటు షిఫ్ట్ ల పద్ధతిలో ఒక గెజిటెడ్ అధికారి, ఒక పోలిస్ అధికారి ఇతర సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తున్నారన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు స్ట్రాంగ్ రూముల భద్రత పట్ల ఏదైనా సందేహాలు ఉంటే నేరుగా అధికారులను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. అదేవిధంగా ఓట్లలెక్కింపు కోసం ఏర్పాట్లు మొదలుపెట్టడం జరిగిందన్నారు. ఓట్లలెక్కింపుపై ఏజెంట్లకు అన్ని వివరాలు తెలియజేయడం జరుగుతుందని, ఓట్లలెక్కింపు రోజున రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్ ల వాహనాల పార్కింగ్, ఏజేంట్లకు పాసులు ఇతర అంశాలపై పూర్తి సమాచారం తెలియజేయడం జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు నిమిత్తం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని పాసులు ఉన్నవారు మాత్రమే లోపలికి అనుమతించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఓట్లలెక్కింపు అనంతరం గెలుపొందిన అభ్యర్థులు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడానికి వీలు లేదన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. జిల్లాలో ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ ఎస్.సతీశ్ కుమార్ పేర్కొన్నారు. జేఎన్టీయూలో స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని.. మొదటి లెవల్ లో కేంద్ర బలగాలు, రెండో లెవల్ లో స్టేట్ ఆర్మడ్ పోలిస్, మూడో లెవల్ లో సివిల్ పోలీస్ ఫోర్స్ ను పెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. డీఎస్పీ, సీఐ, ఎస్ఐ ర్యాంక్ అధికారులతోపాటు మరో ముగ్గురు అధికారులు సమన్వయలోపం రానివ్వకుండా స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్నారన్నారు. కనీసం రెండు రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లను స్ట్రాంగ్ రూముల వద్దకు తీసుకువెళ్లి చూపించడం జరుగుతుందని స్ట్రాంగ్ రూము 100, 200 మీటర్ల పరిధిలో ఎటువంటి వాహనాలు లోపలికి రాకుండా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ విధానం ఓట్ల లెక్కింపు రోజు వరకు కొనసాగిస్తూ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఓట్లలెక్కింపు తర్వాత విజయోత్సవ ర్యాలీలు జరపడానికి అనుమతి లేదని ఒకవేళ అటువంటి సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్పీ ఎస్. సతీశ్ కుమార్ వివరించారు. పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట కాకినాడ పట్టణ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ఇతర ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు

రంపచోడవరం, మేజర్ న్యూస్ : జూన్ నాలుగో తేదీన ఓట్లు లెక్కింపు జరగనున్న నేపథ్యంలో హింసాత్మక ఘటనలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రంపచోడవరం సీఐ వి.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా రంపచోడవరం ఏఎస్పి జగదీష్ హడహళ్ళి ఆదేశాలు మేరకు రంపచోడవరం పోలీసు స్టేషన్ వద్ద సోమవారం పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల నియమావళి ఎవరు అతిక్రమించినా ఉపేక్షించేది లేదని సీఐ వి.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. రంపచోడవరం అసెంబ్లీ, అరకు పార్లమెంటు సార్వత్రిక ఎన్నికల ఫలితాలు దృష్ట్యా ప్రజలు, నాయకులు సమన్వయం పాటించాలని సీఐ వెంకటేశ్వరరావు కోరారు. రాష్ట్రంలో సెక్షన్ 144 సీఆర్పీసీ అమలులో ఉందని, అదే విధంగా ఎన్నికల కోడ్ అమలులోనే ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అల్లర్లు జరుగకుండా సహకరించాలని, గొడవలకు పాల్పడవద్దని, ప్రతీ ఒక్కరు సమన్వయం పాటించాలని విజ్ఞప్తి చేశారు. కౌంటింగ్ అనంతరం ఎటువంటి సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించ కూడదన్నారు. కాగా హింసాత్మక సంఘటనలకు ఎవరైనా పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఈసమావేశంలో రంపచోడవరం ఎస్ఐ మోహన్ కుమార్, దేవీపట్నం ఎస్ఐ కె.వి.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమును సందర్శించిన పిఠాపురం ఆర్వో..

పిఠాపురం, మేజర్ న్యూస్ : పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్ సుందర్ రెడ్డి సోమవారం కాకినాడ జేఎన్టీయూ డా.బీఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలోని ఈవీఎంలు ఇతర ఎన్నికల సామాగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూమును సందర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూముకు వెళ్లి అక్కడి భద్రతను పర్యవేక్షిస్తునట్లు ఆయన తెలిపారు.

కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్ల పర్యవేక్షణ

-ఎస్పీతో కలిసి క్షేత్ర స్థాయిలో సమీక్ష

-జిల్లా ఎన్నికల అధికారి డా కె మాధవీలత

రాజానగరం,మేజర్న్యూస్: నన్నయ్య యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఓటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా కె. మాధవీలత పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఎస్పి పి జగదీష్ తో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వర్తించడం లో జవాబుదారీతనం, పారదర్శకత తో కూడిన ఏర్పాట్ల విషయంలో ఖచ్చితత్వం పాటించే విధానం లో చేపట్టవలసిన వాటిపై దిశా నిర్దేశనం చేయటం జరిగిందని అన్నారు. మూడంచెల భద్రత నేపథ్యంలో చేపడుతున్న కార్యకలాపాలు పై ఎస్పి పి జగదీష్ తో కలిసి సమీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. స్ట్రాంగ్ వద్ద నిర్వహించే భద్రత ఏర్పాట్లు, పోలీస్ ఫోర్సెస్ విధులపై చర్చించడం జరిగింది. అనంతరం విజిటింగ్ రిజిస్టర్ లో సంతకం చేశారు. రాజమండ్రి రూరల్, రాజమండ్రీ సిటి, రాజానగరం, కొవ్వూరు తదితర స్ట్రాంగ్ రూమ్ ల భద్రత ఏర్పాట్లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు చేస్తున్న తీరును ఎస్పితో కలిసి పరిశీలన చేశారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ కేంద్రానికి బ్యాలెట్ యూనిట్స్, ఇతర అనుబంధ పత్రాలు భద్రపరచిన గది నుంచి తీసుకుని రావాలసిన రూట్ మ్యాప్‌పై చర్చించడం జరిగింది. సంబంధిత ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారులు జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, మునిసిపల్ కమిషనర్ కే దినేష్ కుమార్ లు కలెక్టర్ కు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్పి పి. జగదీష్ , జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్, మున్సిపల్ కమిషనర్ కే. దినేష్ కుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, ఆర్డీవో చైత్ర వర్షిణి, అదనపు ఎస్పీ ఎల్. చెంచిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు అలయన్స్ క్లబ్ కాన్ఫరెన్స్

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ కాస్మోపాలిటన్ క్లబ్‌లో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు అలయన్స్ క్లబ్ జిల్లా కాన్ఫరెన్స్, జిల్లా కేబినెట్ ఇన్‌స్టాలేషన్ జరుగుతుందని అలయన్స్ క్లబ్ పిఆర్ఓ దిలీప్ కుమార్ సదనాని తెలిపారు. ఈ కాన్ఫరెన్సో కేబినెట్ సభ్యులు 2024-25 సంవత్సరానికి ప్రమాణ స్వీకారం చేస్తారని, జిల్లా గవర్నర్ వనుం శ్రీనివాసరావు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సి.బాలచంద్రన్, ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్, ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ డిబీజి శాస్త్రి,రెండవ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బి.తిరుపతిరాజు ద్వారా కొత్త క్లబ్ ఇన్‌స్టాలేషన్ తదితర కార్యక్రమాలు జరుగుతాయని సదనాని తెలిపారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు

సామర్లకోట, మేజర్ న్యూస్ : పంచారామ క్షేత్రముగా ప్రసిద్ధి చెందిన సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయం సోమవారం భక్తుల శివ నామస్మరణతో మారుమ్రోగింది.రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు కుమార రామ భీమేశ్వరాలయాని చేరుకుని స్వామివారిని, బాల త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయ కార్యనిర్వహణ అధికారి బల్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వర శర్మ, రాంబాబు తదితరులు బాల త్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామికి విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి స్వామి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ చేశారు.

దొమ్మేరు గ్రామంలో స్వచ్ఛ భారత్ ర్యాలి

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన వ్యవసాయ కళాశాల, రాజమండ్రి అసోసియేట్ డీన్ డా.కె.వి రమణమూర్తి ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ఏడు రోజుల ప్రణాళికలో భాగంగా దొమ్మేరు గ్రామంలో నాల్గవ రోజు స్వచ్ఛ భారత్ ర్యాలి నిర్వహించడం జరిగింది. అనంతరం పెరటి తోట పెంపకం పై జరిగిన అవగాహన సదస్సు లో గ్రామస్తులకు కూరగాయల విత్తనాలు పంచడం జరిగింది.ఈ సందర్భంగా డా.కె.రవికుమార్ మాట్లాడుతూ పెరటి తోట పెంపకం ద్వార సేంద్రియ కూరగాయలను ఇంటి వద్దనే పండించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ అధికారులు డా.కె.దక్షిణ మూర్తి,డా.సి.హెచ్.సునీత,గ్రామస్తులు మరియు వ్యవసాయ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీ నాయకులు ఎటువంటి ఉద్రేకాలకు లోను కాకూడదు

- జిల్లా ఎస్పి సతీష్ కుమార్

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎంసిసి కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీ నాయకులు ఎటువంటి ఉద్రేకాలకు లోను కాకూడదని అలాగే ఎవరిని ప్రేరేపితం చేయరాదని జిల్లా ఎస్పి ఎస్.సతీష్ కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం పెద్దాపురం పట్టణంలో మున్సిపల్ సెంటర్‌లో గల అంబేద్కర్ భవనం నందు డిఎస్పి కె.లతాకుమారి ఆధ్వర్యంలో పెద్దాపురం నియోజకవర్గంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పి సతీష్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఎంసిసి కోడ్ అమలులో ఉన్నందున జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతున్నందున రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎలక్షన్ కోడ్ నియమాలు పాటించాలని, ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు సురేష్, వై.రవికుమార్, ఎస్సైలు వెలుగుల సురేష్, మౌనిక, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు

- స్ట్రాంగ్ రూమ్ లు పరిశీలించిన జిల్లా కలెక్టర్

రంపచోడవరం, మేజర్ న్యూస్ : వచ్చే నెల నాలుగో తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు కేంద్రంలో పకడ్బందీగా ఏర్పాట్లు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ యం.విజయ సునీత పేర్కొన్నారు. రంపచోడవరం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కాలేజీలో రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం, అరకు పార్లమెంటుకు వేరువేరుగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను, ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ వచ్చే నెల నాలుగో తేదీన జరగబోవు ఓట్ల లెక్కింపు కేంద్రాలలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ కు వచ్చే అధికారులకు, సిబ్బందికి అసెంబ్లీకి, పార్లమెంటుకు ఓట్లు లెక్కింపునకు సంబంధించిన కేంద్రాలలో మౌలిక సదుపాయాలు పక్కగా ఏర్పాట్లు చేయాలని ఆమె తెలిపారు. ఓట్ల లెక్కింపు అయ్యేంతవరకు స్ట్రాంగ్ రూమ్ దగ్గరకు ఇతరులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. పటిష్ట భద్రత స్ట్రాంగ్ రూముల దగ్గర ఏర్పాటు చేయడం జరిగిందని, సీసి కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. అనంతరం సిఆర్పిఎఫ్ భద్రత సిబ్బంది వద్ద ఉన్న విజిట్ బుక్‌లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, తాసిల్దార్లు ఏ.వి. రమణ, నాగరాజు, కృష్ణ జ్యోతి తదితరులు ఉన్నారు.

పురుగులు మందు త్రాగిన విద్యార్థి మృతి

గొల్లప్రోలు, మేజర్ న్యూస్ : చదువు భారం భరించలేక ఒత్తిడికి గురైన ఒక విద్యార్థి క్రిమిసంహారక మందు సేవించి ముచ్చులతో మృత్యువుతో పోరాడుతూ సోమవారం తిధి శ్వాస విడిచాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం గోపాలపట్నం గ్రామానికి చెందిన కోనేటి రాజ నరేంద్ర (21) గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో వ్రాసిన పరీక్షల్లో నరేంద్ర ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. దీంతో సుమారు 10 రోజుల క్రితం కళాశాల సమీపంలో గల జీడిమామిడి తోటలోకి వెళ్లి పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. ఇది గమనించిన తోటి విద్యార్థులు నరేంద్రను కాకినాడలో గల ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి మరింత విషమించడంతో నరేంద్రను కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. సుమారు పదిరోజులకు పైగా మృతితో పోరాడిన విద్యార్థి నరేంద్ర ఆదివారం అర్ధరాత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. మృతుడు సోదరుడు కోనేటి సత్య సాయి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ తెలిపారు.

గుట్టల వెనక గుట్టు ఏమిటి..?

-అధికారులకు కనిపించని ఇసుక కొండలు

-ఏ విధమైన చర్యలు లేవని స్థానికుల అగ్రహం

పెరవలి, మేజర్ న్యూస్ : జిల్లాలో ఇసుక తవ్వకాలు విషయంలో తవ్వుతున్న కొద్దీ ఆరోపణలు కొండలా పేరుకు పోతున్నాయి. ఒకవైపు తవ్వకాలతో పాటు మరోకవైపు నిబంధనలకు విరుద్ధంగా కొండలను తలపించే ఇసుక గుట్టలు నిలువ చేశారు. ఈ గుట్టలు గత గుత్తేదారుడు జేపీ కంపెనీవా లేక ప్రస్తుతం ఇసుక త్రవ్వకాలు చేస్తున్న ప్రతిమ కంపెనీవా తెలియని పరిస్థితి. ప్రతిమ కంపెనీ వారు ఇసుక తవ్వకాలను గత మూడు నెలలుగా నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ బిల్లులు కూడా ఇవ్వకుండా రాత్రి పగలు తేడా లేకుండా జోరుగా త్రవ్వకాలు జరిపారు. గోదావరి నీటి ప్రవాహానికి అడ్డుకట్టలు వేయడంతో పాటు పెద్ద పెద్ద జెసిబి లతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపారు ఓపెన్ రీచ్లు కలిగిన తీపర్రు కానూరు పెండ్యాల మొదలగు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా పెద్దపెద్ద ఇసుక గుట్టలను వేశారు అధికారులకు ఈ తంతంతా తెలిసిన ఏమి పట్టనట్టు గా వ్యవహరించడంతో గుత్తెదారులు ఇష్టారాజ్యంగా ఎక్కడపడితే అక్కడ ఇసుక గుట్టలను కొండలను తలపించేలా వేశారు ఓపెన్ రీచ్లకు కేవలం 40 వేల నుండి 60 వేల క్యూబిక్ మీటర్లు ఇసుక మాత్రమే తీయవలసి ఉండగా ఒక్కొక్క గుట్ట లక్ష క్యూబిక్ మీటర్లకు పైగా ఇసుక నిల్వలను వేయడం ఎంతవరకు సమంజసం దీనిపై అధికారులుఆలోచించాలని ప్రజలు అంటున్నారు ఈ గుట్టలు అక్రమంగా నిలవ వేయడంతో పాటు కనీసం మైనింగ్ బిల్లులు ఇవ్వకుండా ఇసుక రవాణాను చేస్తున్నారు ప్రస్తుతం ఎక్కడికక్కడ ఇసుక గుట్టలు ఉన్న వీటి వైపు మైనింగ్ విజిలెన్స్ అధికారులు తో పాటు స్థానిక అధికారుల వరకు ఎవరూ పట్టునట్లు వ్యవహరించడంతో ఇందులో మర్మమేమిటో తెలియక ప్రజలు తలలు పట్టుకుంటున్నారు 40 వేల క్యూబిక్ మీటర్లు ఇసుక తవ్వకాలు జరపవలసి ఉన్నప్పటికీ ఈ గుట్ట ఒకటే దాదాపు లక్ష క్యూబిక్ మీటర్ల ఇసుక ఉంటుందని ఇది అధికారుల నిర్లక్ష్యనీకి నిదర్శనంగా చెప్పవచ్చు అనే స్థానికులు ఆరోపిస్తున్నారు జిల్లాలో ప్రతి ఓపెన్ రీచ్ దగ్గర ఈ ఇసుక గుట్టలు ఉండటం అవి అధికారులకు కనిపించకపోవడం విడ్డూరంగా చెప్పవచ్చు ముఖ్యంగా జిల్లాలో ఇసుక కమిటీ జిల్లా కమిటీ అధ్యక్షతన జరపవలసి ఉన్న కమిటీ సమావేశాలు నామమాత్రంగా నిర్వహిస్తూ ఉండటంవల్లే ఇటువంటి అక్రమాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకాలను కేవలం మనుషులతోటే జరపవలస ఉన్న గత కొంతకాలంగా అడ్డు అదుపు లేకుండా భారీ యంత్రాలతోతవ్వకాలు జరపటం అధికారులు చూసి చూడనట్లు వదిలేయటం బహిరంగ రహస్యమే ఇటీవల కోర్టులు ఈ విషయంపై కల్పించుకుని రాష్ట్ర అధికారులపై తీవ్రంగా ధ్వజమెట్టడంతో ఇప్పుడు నామ మాత్రం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ ఇసుక త్రవ్వకాలు పై పరిశీలన చేయవలసి ఉన్న మైనింగ్ అధికారులు రోజంతా రాంపుల్లోనే తెప్పవేసి దళారీలకు అనుకూలంగా నివేదికలు తయారుచేసి జిల్లా కలెక్టర్కు సమర్పిస్తున్నారని ఆరోపణలు వెళ్ళు వెత్తుతున్నాయి. ఇందుకు రాంపులలో జరుగుతున్న తంతును చూస్తే నిజమే అనిపిస్తుంది లక్షల క్యూబిక్ మీటర్లు ఇసుక తవ్వకాలు జరిపారని బహిరంగంగా చెబుతున్నా అధికారులకు మాత్రం కనిపించడం లేదు మైనింగ్ అధికారులు ఈ నెల 17 వ తారీఖున దాడులు నిర్వహించి ర్యాంపు ఇటువైపు నుండి కోనసీమ జిల్లా కట్టుంగ వరకు కాలినడకని వెళ్లి ఆ గోతులను పరిశీలించారు. అయితే ఈ నెల 19వ తేదీన తీపర్రు ఇసుక ర్యాంపుకు పరిశీలన నిమిత్తం జిల్లా కలెక్టర్ వారు రాంపుకు వచ్చేసరికి గోదావరిలో నీరు ఉండటంతో పాటు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీలు వెళ్లే బాటను ధ్వంసం చేసి తొలగించారు దీంతో గోదావరిలో ఇసుక త్రవ్వకాలు ఏ మేరకు జరిగాయి అనేది తెలియకుండా పోయింది. అంతేకాకుండా మైనింగ్ అధికారులు గుత్తేదారులకు అనుకూలంగా మాట్లాడటం ఇసుక ర్యాంపులో జరిగిన తవ్వకాలు కోనసీమ పరిధిలో జరిగాయని ఇవి మాకు సంబంధం లేదని జిల్లా కలెక్టర్కు నేరుగా చెప్పటంతో స్థానికులు నివ్వరపోయారు జిల్లా కలెక్టరే ఈ విషయాన్ని స్వయంగా పత్రిక విలేకరులకు తెలిపారు దీనిని బట్టి ఇక్కడ అక్రమాలు జరిగాయని అక్రమార్కులకే అధికారులు అండదండలు పుష్కలంగా ఉన్నాయని తెలుస్తున్నది నిడదవోలు నరసాపురం ఆర్ అండ్ బి రహదారి ప్రక్కన కొండ లా వేసిన ఇసుకగుట్ట మైనింగ్ అధికారులకు కానీ స్థానిక అధికారులకు కానీ కనిపించకపోవడం విడ్డూరంగా ఉంది.ఇప్పటికైనా అధికారులు గోదావరి ఇసుక తవ్వకాలతో పాటు ఆర్ అండ్ బి రహదారి ప్రక్కన నిల్వ ఉంచిన ఇసుక గుట్టలపై కూడా తనిఖీలు నిర్వహిస్తే దళారీల దోపిడీని అరికట్ట వచ్చునని స్థానికులు అంటున్నారు.